క్లుప్తంగా

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి



వేళంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ లక్ష్మి, అంగన్‌వాడీలు, చిన్నారులు

కరప: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే కాకుండా ఆట, పాటలతో విద్యా బుద్ధులు నేర్పించడం జరుగుతుందని కాకినాడ రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ కె.లక్ష్మి అన్నారు. జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేళంగిలో చిన్నారులతో కల్సి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ లక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలు(ప్రీస్కూలు)లో చేర్పించాలన్నారు. వేళంగి, గొర్రిపూడి సెక్టార్ల సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, కె.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్‌కు నివాళులు



హెలెన్ కెల్లర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ రెడ్డి తదితరులు

కాకినాడ రూరల్: వాకలపూడి ఉమా మనోవికాస కేంద్రంలో హెలెన్ కెల్లర్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేంద్రం నిర్వాహకుడు ఎస్పీ రెడ్డి జ్యోతి పాల్గొని హెలెన్ కెల్లర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మానవ శరీరంలో ప్రధానమైన దృష్టి, వినికిడి సమస్యలతో బాధపడిన హెలెన్ రచయితగా రాణించడమే కాక, తన వంటి సమస్యలతో బాధపడేవారి సౌకర్యం కోసం బ్రెయిలీ లిపిలోకి తన రచనలు అనువదించి అంధులకు ఉచితంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, కృష్ణారావు, ఉమారెడ్డి, నాయుడు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

జగ్గంపేట: మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులను జగ్గంపేట పోలీసులు కోర్టుకు హాజరుపరచగా ఇద్దరికి జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.20వేల జరిమానా విధించినట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం... జగ్గంపేటలో రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న బి.రంజిత్, యు.శ్రీను, డి.వీరబాబు, ఎస్.గుర్రయ్యలను పట్టుకున్నారు. వీరిని పెద్దాపురం కోర్టులో మంగళవారం హాజరుపరచగా పెద్దాపురం జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ వాహనాలు నడిపిన బి.రంజిత్, యు.శ్రీనులకు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించారు. డి.వీరబాబుకు రెండు రోజులు జైలు శిక్ష, ఎస్.గుర్రయ్యకు 5 రోజులు జైలు శిక్ష విధించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తరచూ నిర్వహిస్తున్నామని ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కిర్లంపూడి: లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగినట్టు కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం, తూర్పుపాకల గ్రామానికి చెందిన ఆకుల నాగమణి(47) తన భర్త అప్పారావుతో కలిసి సోమవారం ఏలేశ్వరంలో వారి బంధుల ఇంట జరుగుతున్న శుభకార్యానికి వెళ్లారు. తిరిగి ప్రయాణంలో మోటారుసైకిల్‌పై వస్తుండగా సోమవరం జాతీయ రహదారిపై వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే నాగమణి మరణించింది. మృతురాలికి కూతురు ఉంది. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు వాహనాల పంపిణీ


సామర్లకోట: స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ జిల్లా చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఆమె పాల్గొని వీటిని అందజేశారు. నియోజకవర్గానికి వచ్చిన 10 వాహనాలను అందజేశామన్నారు. ఈ సందర్భంగా ముంతాజ్‌ను దొరబాబు సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొద్దు మంగతాయారు, జెడ్పీటీసీ సభ్యుడు గుమ్మడి సూరిబాబు, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జాన్ పీటర్ ఇకలేరు

పెద్దాపురం: స్థానిక లూథరన్ పాఠశాలల కరస్పాండెంట్ గా, ఉపాధ్యాయుడిగా సేవలందించి విశ్రాంత ఉపాధ్యాయుడు బూసి జాన్ పీటర్ (87) మంగళవారం మృతి చెందారు. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌కు బాట లు వేసి, అందరి మన్ననలు పొందిన పీటర్ మృతితో పెద్దాపురం క్రిస్టియన్‌పేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి పట్టణ ప్రముఖులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వారి పాఠాలు సెపరేటు

- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల కొనుగోళ్లకు విముఖత
- ప్రభుత్వ నిబంధనలు కాదని ప్రైవేటుగా ప్రింటింగ్
- అటువంటి వారిపై చర్యలు తప్పవన్న డీఈఓ



బాలాజీచెరువు: ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో సమాంతర చదువులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్‌సీఈఆర్‌టీ (జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ) ద్వారా ముద్రించిన పాఠ్య పుస్తకాలనే అన్ని పాఠశాలల యాజమాన్యాలు వినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రైవేట్ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సకాలంలో సరఫరా చేసేలా ప్రజాశక్తి ప్రింటర్స్, విశాలాంధ్ర సమితి ద్వారా ముద్రణకు అవకాశం కల్పించారు. ఇక్కడ ఎంపిక చేసిన దుకాణాల్లో పుస్తకాలు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల వారు పాఠ్య పుస్తకాల కొనుగోలుకు ముందుకు రావడం లేదు. పాఠ్య పుస్తకాలు కావాలని చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేసుకోవాలని సూచించినా వారు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కాకినాడ నగరంలో 128, రూరల్ 76 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో కనీసం 40 శాతం పాఠశాలలు కూడా నమోదు చేసుకోలేదు.

నిర్ణీత ధరలకే పుస్తకాలు..

విద్యార్థులకు అందుబాటులో ఉండేలా పాఠ్యపుస్తకాలు నిర్ణీత ధరలకే విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. 1వ తరగతి రూ.399, రెండో తరగతి రూ.425, మూడో తరగతి రూ.675, నాలుగో తరగతి రూ.702, ఐదో తరగతి రూ.727, ఆరో తరగతి రూ.747, ఏడో తరగతి రూ.871, ఎనిమిదో తరగతి రూ.1,181, తొమ్మిదో తరగతికి రూ.1,167, పదో తరగతికి రూ.858గా నిర్ణయించారు. దుకాణాల్లోనే ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని విద్యాశాఖ ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సొంత పుస్తకాలకు వీల్లేదు..

ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో తప్పనిసరిగా ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన పాఠ్య పుస్తకాలతోనే బోధన సాగాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని కార్పొరేట్ స్కూళ్లలో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ కాకుండా తమ సొంత సిలబస్‌తో పుస్తకాలు ముద్రించి వాటిని విద్యార్థులతో కొనుగోలు చేయిస్తున్నారు. నగరంలో కొన్ని పేరొందిన పాఠశాలలు సొంతంగా ముద్రించిన పుస్తకాలనే విక్రయిస్తున్నారు. ఒకటో తరగతి పుస్తకాలకు రూ.5 వేలకు పైగా వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

అందుబాటులో పాఠ్యపుస్తకాలు..



ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన పాఠ్య పుస్తకాలనే వినియోగించాలి. ఎంపిక చేసిన దుకాణాల్లో నిర్ణీత ధరలకే పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఏ పాఠశాలా సొంత ముద్రణ పుస్తకాలు విక్రయించరాదు. అలాగే అధిక ధరలు వసూలు చేసి స్వంత పుస్తకాలు విక్రయిస్తే పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఈఓ, కాకినాడ

వైద్య, రైతు సేవలపై ఆరా



పెద్దాపురం కోల్డ్ స్టోరేజీలో ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న ద్వివేది, కృతికా శుక్లా

- ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది విస్తృత పర్యటన
- సీహెచ్‌సీలో డెంటల్ స్కానర్ ఇచ్చేందుకు, పోస్ట్‌మార్టం గది ఏర్పాటుకు హామీ

సామర్లకోట: రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది మంగళవారం పట్టణంలోను, మండలంలోను విస్తృతంగా పర్యటించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యంపై రోగుల నుంచి ఆరా తీసారు. ఆస్పత్రిలో ఉన్న సదుపాయాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో డెంటల్ స్కానింగ్ లేక పోవడం వల్ల వైద్యులు ఉన్నా నిరుపయోగంగా ఉన్నారని కౌన్సిలర్లు నేతల హరిబాబు, పెండ్యాల అబ్బులు ఫిర్యాదు చేయడంతో ఆయన కలెక్టర్ ద్వారా దానిని ఏర్పాటు చేస్తామని, పోస్టుమార్టం గది కూడా ఏర్పాటుచేయిస్తానని ఆయన అన్నారు. సిబ్బంది పని తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వ్యవసాయ క్షేత్రాన్ని, ఉండూరులోని ఆర్బీకేను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అందజేసిన మినీ ట్రాక్టర్ల వల్ల ఎంత వరకు ప్రయోజనం కలుగుతోందని రైతులను అడిగారు. పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు సాగుహక్కు కార్డులు అందజేశారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, అసిస్టెంట్ కలెక్టరు ప్రఖార్ జైన్, డీఆర్వో ఎస్‌వీవీ సత్యనారాయణ, జేడీ ఎన్.విజయకుమార్, ఏడీఏ జీవీ పద్మశ్రీ, ఏఓ ఐ.సత్య, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఉండూరు గ్రామ సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆహార భద్రతకు కోల్డ్ స్టోరేజీలు

పెద్దాపురం: రైతు ఉత్పత్తుల భద్రతకు కోల్డ్ స్టోరేజీలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. స్థానిక వాలుతిమ్మాపురం జంక్షన్‌లో కోల్డ్ స్టోరేజీలోని ఆహార ఉత్పత్తులను మంగళవారం పరిశీలించారు. జిల్లా అధికారులతో పాటు ఉద్యాన శాఖ జిల్లా అధికారి మల్లిఖార్జునరావుతో కలిసి పరిశీలించారు. ఆహార ఉత్పత్తుల నిల్వ పద్ధతులపై సంస్థ డైరెక్టర్ విజయ సారథిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టోరేజ్‌లో ఉన్న ఆహార ఉత్పత్తులను పరిశీలించారు. వారితో పాటు డీఎల్‌డీఓ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఉద్యానశాఖాధికారి ఎస్.సుజాత, చిలకమ్మ, ఏఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవితకు శ్రద్ధతీసుకోవాలి

- తల్లిదండ్రులకు ఆర్జేడీ నాగమణి హితవు
- జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశం



సర్పవరం జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

కాకినాడ రూరల్: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్జేడీ జి.నాగమణి అన్నారు. మంగళవారం సర్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులను సొంత మేనమామగా భావిస్తూ విద్యార్థులే నవ్య సమాజ భవిష్యత్తుగా ప్రాధాన్యమిస్తూ వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాణ్యతా ప్రమాణాలతో తీర్చిదిద్దారన్నారు. సకల సౌకర్యాలతో నేడు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. జగనన్న విద్యాకానుక పేరుతో ఒక్కో విద్యార్థికి పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టు, షూస్, మూడు జతల బట్టలు, స్కూల్ బ్యాగ్ రూ.2,419 ఖర్చు చేస్తున్నారన్నారు. గోరుముద్దలో భాగంగా కోడిగుడ్డు, రక్తహీనత లేకుండా వేరుశనగ చిక్కీలు, ఐరన్ టాబ్లెట్లు, మధ్యాహ్న భోజనం, ఆరోగ్యంగా ఉండేందుకు రాగిజావ అందిస్తున్నామన్నారు. విద్యా పరంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలను పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలతో రాత్రి సమయంలో కలసి భోజనం చేస్తూ తాము పడుతున్న కష్టం విలువను తెలియజేయాలన్నారు. తద్వారా వారికి బాధ్యత పెరిగి బాగా చదువుకుంటారన్నారు. పాఠశాలకు వచ్చి తమ పిల్లల చదువు ఎలా ఉందో తెలుసుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ నెలాఖరు లోపు విద్యార్థులు కొత్త యూనిఫాంతో పాఠశాలలకు రావాలన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి వచ్చిన తల్లిదండ్రులు హెచ్‌ఎంగా పనిచేసి సామర్లకోట మండలానికి ఎంఈఓగా వెళ్లిన పి.ఫుల్లయ్యను తిరిగి పాఠశాలకు హెచ్‌ఎంగా నియమించాలని కోరడంతో వారు సానుకూలంగా స్పందించారు. కొత్తగా యూనిఫాంతో వచ్చిన విద్యార్థులతో ఆర్జేడీ ఫొటోలు తీయించుకుని, అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, తల్లిదండ్రులతో ఫొటోలు తీయించుకున్నారు. ఎంఈఓ గణేష్‌బాబు, విద్యాకమిటీ చైర్‌పర్సన్ మండపాక దేవి, కమిటీ సభ్యులు ఎల్.ఎస్.వీరభద్రరాజు, రవి, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు




మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ఏటా నిర్వహించే పెద్దాపురం మరిడమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ప్రతి ఇంటి అవసరాలు గుర్తించాలి

ఎంపీడీఓ అప్పారావు



నడకుదురులో మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష నిర్వహిస్తోందని ప్రజలకు వివరించి, ప్రతి ఇంటికీ వెళ్లి వాళ్ల అవసరాలు గుర్తించాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. నడకుదురు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామవలంటీర్లు, సచివాలయం, పంచాయతీ సిబ్బందితో ఆయన సమావేశమై ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అర్హత ఉండీ సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు కూడా నమోదచేయాలన్నారు. ఏ తేదీన గ్రామసచివాలయంలో ధృవీకరణ పత్రాలు ఉచితంగా అందజేసేది తెలియజేయాలని ఎంపీడీఓ వివరించారు. సర్పంచ్ దేగల లలితకుమారి, ఎంటీసీ సభ్యురాలు పైలా రామతులసి, వైఎస్సార్ సీపీ నాయకుడు పైలా గోవిందు, కార్యదర్శి పీఎస్ఆర్‌పీ బ్రహ్మానందం పాల్గొన్నారు.

పట్టణ పేదలకు పక్కా ఇళ్లు

- రూపాయికే సొంతింటి కల సాకారం
- సకల సదుపాయాలతో ముస్తాబు
- టిడ్కో లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు



పెద్దాపురంలో సుందరంగా నిర్మించిన జగనన్న టిడ్కో కాలనీ

పెద్దాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా.. రాష్ట్రాభివృద్ధే ఆశయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారు. ఒక్క రూపాయికే లక్షల విలువైన పక్కా ఇంటిని పేదలకు అందించే బహత్తర కార్యక్రమానికి సీఎం జగన్ గత ఏడాది జూన్ 28న విజయనగరం జిల్లాలో శ్రీకారం చుట్టారు. జగనన్న టిడ్కో కాలనీల్లో ఇళ్లను లబ్ధిదారులకు అందజేసి సొంతింటి కలను సాకారం చేశారు.

పట్టణాల్లో ఇళ్లులేని నిరుపేద కుటుంబాలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ పత్రాలను చేతికి అందిస్తానన్న సీఎం జగన్ హామీ సాకారమైంది.. నియోజకవర్గంలో సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో సుమారు 4368 మంది లబ్ధిదారులకు టిడ్కో ఫ్లాట్లను అందజేశారు.

రాష్ట్ర ప్రభుత్వం 'ఏ కేటగిరి' కింద ఒక్కో ఇంటిని రూ.6.55 లక్షల వ్యయంతో నిర్మిస్తోంది. ఆ మొత్తంలో కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు ఇస్తోంది. మిగిలిన సొమ్ము రూ.5.05 లక్షలు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ నిర్మించి లబ్ధిదారులకు అందజేస్తోంది.' సీ కేటగిరి'లో 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.8.55 లక్షల చొప్పున నిర్మాణ వ్యయం అవుతోంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.1.5 లక్షలు కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2.9 లక్షలు సమకూరుస్తోంది. లబ్ధిదారుడి వాటాకింద రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు రుణం రూ.3.65 లక్షలను అధికారులు సమకూర్చారు.

ఇంట్లో చక్కని వసతులు

ఇళ్లలో టైల్స్‌తో కూడిన గచ్చు ఏర్పాటు చేశారు. బెడ్‌రూమ్, లివింగ్ రూమ్ ఆకట్టుకునేలా రూపొందించారు. గ్రానైట్ ప్లాట్‌ఫాంతో కూడిన వంట గది, సింక్ చక్కగా ఉన్నాయి. ఆధునిక వసతులతో కూడిన టాయిలెట్ చక్కగా ఉంది. కాలనీలో 40 అడుగుల వెడల్పుతో కూడిన రోడ్ల నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కల్పించారు.

సొంతింటి కల సాకారం



పేదల సొంతింటి కల సాకారం చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యపడింది. రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల ఇళ్లు నిర్మించడమే గాక పట్టణ ప్రాంత ప్రజలకు టిడ్కో ద్వారా ఫ్లాట్లు అప్పగించి పేద కుటుంబాలు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరలోనే పూర్తి స్థాయిలో ఫ్లాట్లు అప్పగించేలా చర్యలు చేపట్టాం. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఇళ్లను సక్రమంగా వాడుకుని సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి.

–దవులూరి దొరబాబు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం

చాలా ఆనందంగా ఉంది



సొంతింటి కల సాకారమైనందుకు చాలా ఆనందంగా ఉంది. ఉమ్మడి ఇంటిలో చాలీచాలని గదుల్లో ఉన్న మాలాంటి కుటుంబాలకు టిడ్కో ఇళ్లు ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఒక్క రూపాయి రిజిస్ట్రేషన్‌తో ఇచ్చిన మాటకు కట్టుబడి ఇంటిని ఇచ్చిన ప్రభుత్వానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుంది.

–ఈటవర్తి నాగలక్ష్మి, లబ్ధిదారు, గుడివాడ, ఒకటో వార్డు, పెద్దాపురం



ఫ్లాట్లను లాటరీ పద్ధతిలో కేటాయిస్తున్న అధికారులు (ఫైల్)





టైల్స్‌తో సుందరంగా ఉన్న టిడ్కో ఇళ్లు, ఫ్లాట్లు, వంటగది

రక్తదాతలకు అభినందనలు



రక్తదాతను అభినందిస్తున్న గోపాలకృష్ణ ద్వివేది, కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: వికాస మరియు కాకినాడ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వికాస కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కలెక్టర్ కృతికా శుక్లా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న వికాస పీడీ కె.లచ్చారావును, దాతలను, కార్యక్రమానికి సహకరించిన కాకినాడ సేవా సంఘం వారిని ద్వివేది అభినందించారు. అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, జిల్లా అధికారులు, వికాస సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పోరాడండి

కాకినాడ సిటీ: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉంచిన పథకాల పరిహారం కార్మికులకు చెల్లించాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. జిల్లా సీఐటీయూ భవనంలో నిర్వహించిన వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఇసుక సంక్షోభం, కరోనా సంక్షోభం వల్ల కుదేలైన నిర్మాణ రంగంపై ఆధారపడిన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. జూలై ఒకటో తేదీన జిల్లాలో ఉన్న నియోజకవర్గ ఎమ్మెల్యేలకు కార్మికులందరితో వెళ్లి వినతి పత్రం ఇవ్వాలని, జూలై 18, 19 తేదీల్లో నాయకత్వ శిక్షణ తరగతులకు అన్ని సంఘాల ప్రధాన నాయకత్వాలు హాజరవ్వాలని, ఆగస్టు 1న అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాలు వద్ద ఘెరావ్ చేపట్టాలని సమావేశం తీర్మానించింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామదేవత ఆలయ సమీపంలో చర్చి నిర్మించొద్దు

కరప: వేములవాడ గ్రామదేవత ముసాలమ్మ గుడి సమీపంలో చర్చి నిర్మాణం తగదని, గ్రామంలో వర్గ వైషమ్యాలు తలెత్తకుండా, సామరస్యంగా ఉండాలంటే ఈ నిర్మాణాన్ని ఆపాలని గ్రామస్తులు మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామస్తులందరూ ఏకమై తమ ఇంటి ఆడపడుచులను, బంధు, మిత్రులను రాజకీయ పార్టీనాయకులను, అధికారులను పిలిచి రెండేళ్లకు ఒకసారి అమ్మవారి జాతర, తీర్థం ఘనంగా నిర్వహిస్తారు. ఈ మధ్యకాలంలో పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన ఒక పాస్టర్ ఈ ఆలయసమీపంలో కొందరి సహకారంలో చర్చి నిర్మిస్తున్నారని, ఆ విషయాన్ని గ్రామస్తులు ప్రశ్నించగా చర్చి కాదని చెప్పి మళ్లీ ఆ నిర్మాణం చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై నౌడు రామకృష్ణ స్పందించి దీనిపై విచారణ జరిపి, న్యాయం చేకూర్చాలని 300 మంది వరకు గ్రామస్తులు సంతకాలు చేసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బంకించంద్ర చటర్జీకి నివాళులు

కాకినాడ రూరల్: వందమాతరం సృష్టికర్త బంకించంద్ర చటర్జీ జయంతిని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. చటర్జీ చిత్రపటానికి గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హంస వాహనంపై రేపు బాబా ఊరేగింపు

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వ్‌పోలీస్‌లైన్‌లోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సాయిబాబా 25వ ప్రతిష్ఠ దినోత్సవాల్లో భాగంగా గురువారం భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు హంస వాహనంపై బాబాను ఊరేగించనున్నట్లు ఆయన తెలిపారు. అయ్యప్పస్వామి ఆలయం నుంచి భానుగుడి శ్రీరామ్ నగర్ ప్రధాన రహదారుల్లో ఈ ఊరేగింపు జరుగుతుందన్నారు.

పార్టీని బలోపేతం చేయండి

బోట్‌క్లబ్: బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు గుటూరి పద్మ అన్నారు. స్థానిక 29వ డివిజన్‌లోని బీజేపీ దక్షిణ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం బూత్ కనీ్వనర్ల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ తీసుకు వెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాలలో నేర్పిన పాఠ్యాంశాలను తల్లిదండ్రులు ఇంటి వద్ద చదివించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు ఉన్నాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ పప్పు మాధవీదేవి, ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, ఏఎల్‌వీ కుమారి, వి.రాజు, జి.గోవిందు, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.